

లక్ష్మి ఆనకట్టకు కోతలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి కాలువ ఆనకట్ట కోతలకు గురవుతోంది.

- 8లో ▸



పాత ఏజెన్సీలకే..

వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రులలో వివిధ విభాగాల కాంట్రాక్ట్‌ను సర్కారు మరో ఏడాది పొడిగించింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.8 /23.4

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

గ్రామాల్లో ట్రెయినీ అదనపు కలెక్టర్ పర్యటన



భీమ్‌గల్: మండలంలోని పెద్దమ్మ కాడి తండా, కొత్త తండా, రహత్‌నగర్ గ్రామాల్లో ట్రెయినీ అడిషనల్ కలెక్టర్ సంకిత్ కుమార్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లోని డంపింగ్ యార్డు, నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు, అంగన్‌వాడీ, ప్రైమరీ స్కూళ్లను సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యదర్శుల పనితీరును ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్మూర్ డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఏపీఎం రవీందర్, పంచాయతీ సెక్రెటరీలు, ఐకేపీ, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వలన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 20వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ఒక్క రోజు వ్యవధిలో 0.5 అడుగుల నీటి మట్టం పెరిగింది. ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 371 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80 టీఎంసీలు) కాగా బుధవారం రాత్రి వరకు 1071.30 అడుగుల(25.4 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

రుణమాఫీ సందేహాలను నివృత్తి చేయాలి

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రుణమాఫీపై రైతుల సందేహాలను నివృత్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ ఆదేశించారు. మండలంలోని తాటిపల్లిలో ఏఈవోలు నమోదు చేసిన పంటల వివరాలను డీఏవో బుధవారం పరిశీలించారు. రుణమాఫీ వివరాల కోసం వచ్చే రైతులకు తగిన సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. పంటల సాగు వివరాలను సరిగ్గా నమోదు చేయాలని, మండలంలో ఏఏ పంటలు ఎన్ని ఎకరాల్లో సాగవుతున్నాయో గణాంకాలను సరిగ్గా సేకరించాలని చెప్పారు.

ఆరు రోజుల పాటు ప్రమాదరహిత వారోత్సవాలు



ఖలీల్‌వాడి: ప్రమాద రహిత వారోత్సవాలను ఈనెల 24 నుంచి 30 వరకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం జానీరెడ్డి తెలిపారు. నిజామాబాద్-1 డిపోలో బుధవారం ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ రవాణా అధికారిణి జి.దుర్గాప్రమీల ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. దసరా – 2023 పండుగ సందర్భంగా బస్సులో ప్రయాణించిన లక్కీడ్రా విజేతలైన ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులకు రూ. 9,900 డీడీలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి జె.ఉమా మహేశ్వర్‌రావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, నిజామాబాద్-1 డిపో మేనేజర్ బీఎస్ ఆనంద్, నిజామాబాద్-2 డిపో మేనేజర్ ఎన్.సాయన్న, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో లేబర్ రూం వద్దే మహిళ ప్రసవం

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో లేబర్ రూం వద్దే ఓ మహిళ ప్రసవించింది. బుధవారం మోపాల్ మండలంలోని సిర్పూర్‌కు చెందిన జ్యోతి తన భర్త రమేశ్‌తో పాటు ఉదయం డెలివరీ కోసం జీజీహెచ్‌కు వచ్చింది. సాయంత్రం సమయంలో నొప్పులు రావడంతో కాన్పు కోసం ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్తున్న తరుణంలో గర్భిణి లేబర్ రూం వద్దే డెలివరీ అయ్యింది. నడుచుకుంటూ వెళ్తుండగా డెలివరీ కావడంతో శిశువు ఒక్కసారిగా కిందపడడంతో తలకు గాయమైనట్లు తెలిసింది. వెంటనే ఆడ శిశువును చికిత్స నిమిత్తం ఐసీయూలోకి తీసుకెళ్లారు. అయితే లేబర్ రూం వద్ద గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి.

ఇందూరు పెద్ద పండుగ







నగరంలోని ప్రజలందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే 'ఊర పండుగ'కు 76 ఏళ్ల చరిత్ర ఉంది. అన్ని కులాల భాగస్వామ్యంతో ఏర్పడిన సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి యేడాది ఉత్సవం ఘనంగా జరుగుతుంది. ఖిల్లా శారదాంబ గద్దె నుంచి గ్రామ దేవతల ఊరేగింపు ప్రారంభమవుతుంది. అనంతరం వివిధ చోట్ల 14 గుడులలో విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఈ రోజు ప్రత్యేకంగా తయారు చేసిన 'సరి' ఇళ్లపై చల్లుతారు.

- ఊరూవాడ జరుపుకునే ఉత్సవం
- నగరంలోని అన్నికులాల ఐక్యతకు ప్రతీక
- ఈ నెల 28న నిర్వహణకు సర్వసమాజ్ ఏర్పాట్లు
- ఏటా మామిడి కర్రతో కొత్త విగ్రహాలు.. పాత విగ్రహాలు గోదావరిలో నిమజ్జనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు ఊర పండుగ.. గత 76 ఏళ్లుగా నగరంలోని అన్ని కులాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఎనిమిది దశాబ్దాల క్రితం ప్లేగు వ్యాధి ప్రబలిన సమయంలో ఈ నగరంలో ప్రారంభమైన ఊర పండుగ (పెద్ద పండుగ)కు నగర ప్రజలు ఎనలేని ప్రాధాన్యత ఇస్తారు. ఈ నెల 28న ఊర పండుగను ఘనంగా నిర్వహించేందుకు సర్వసమాజ్ కమిటీ రంగం సిద్ధం చేసింది. నగరంలోని 12 చోట్ల కొలువై ఉన్న గ్రామ దేవతల గుడులలో అన్ని కులాల్లోని అన్ని కుటుంబాలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. నగరంలో అత్యధిక జనాభా పాల్గొనే ఈ పండుగ ప్రారంభ, ముగింపు ఉత్సవాలు, ఊరేగింపులు భారీ ఎత్తున జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



హమల్‌వాడి శివాజి విగ్రహం వద్ద గ్రామ దేవత పొడాలమ్మ

ఖిల్లా శారదాంబ గద్దె నుంచి భారీ ఊరేగింపు..

14 గ్రామ దేవతల గుడులకు సంబంధించిన ఊరేగింపు ఖిల్లా శారదాంబ గద్దె నుంచి మొదలవుతుంది. పండుగ సన్నాహక క్రతువులో భాగంగా ఈ నెల 23న బండారు పోశారు. ఊర పండుగ నేపథ్యంలో భారీ ఊరేగింపు పెద్దబజార్ చౌరస్తా వద్ద దుబ్బ, వినాయక్‌నగర్, సిర్నాపల్లి గడి రోడ్ అనే విభాగాలుగా విడిపోతాయి. తరువాత 14 గ్రామ దేవతల గుడులకు తీసుకెళ్లి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. గాజుల్‌పేటలోని వివేకానంద చౌరస్తా వద్ద భారీ పోలీసు బందోబస్తు మధ్య సరి (ఇంటిపై చల్లుకునే పదార్థం) చల్లుతారు. ఊరేగింపు రోజు తెల్లవారుజాము 2 గంటల నుంచే కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. ఉదయం 9గంటల నుంచి ఊరేగింపు మొదలవుతుంది.

నకాశ్ గల్లీలో తయారీ

14 గ్రామ దేవతల గుళ్లలో ప్రతి సంవత్సరం ఎప్పటికప్పుడు మామిడి కర్రతో తయారు చేసిన కొత్త విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. నగరంలోని నకాశ్ గల్లీలో ఈ విగ్రహాలను తయారు చేస్తారు. బండారు పోసిన తరువాత ఈ విగ్రహాల తయారీ ప్రారంభిస్తారు. కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించాక పాత విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేస్తారు.

గ్రామదేవతలు కొలువైన 14 గుడులు

- సార్గమ్మలు–1, బాలికల ఉన్నత పాఠశాల
- సార్గమ్మలు–2, బాలికల ఉన్నత పాఠశాల
- కొండలరాయుడు, సిర్నాపల్లి గడి
- బోగంసాని, సిర్నాపల్లి గడి
- మహాలక్ష్మి అమ్మవారు, మహాలక్ష్మినగర్
- అంపుడు పోశమ్మ, మహాలక్ష్మినగర్
- ఆను, మహాలక్ష్మినగర్
- రాట్నం, మహాలక్ష్మినగర్
- ఐదు చేతుల పోచమ్మ, వినాయక్‌నగర్
- మత్తడి పోచమ్మ, హనుమాన్ జంక్షన్
- పొడాలమ్మ, హమల్‌వాడి
- పెద్దమ్మ తల్లి, దుబ్బ
- అడెల్లి పోచమ్మ, దుబ్బ
- జెండా, దుబ్బ



దుబ్బ రోడ్డులోని రాట్నం, చక్రం గ్రామ దేవతలు



వినాయక్‌నగర్ 100 ఫీట్ల రోడ్డులో కొలువైన మత్తడి పోచమ్మ గ్రామదేవత



గోల్‌హనుమాన్ రోడ్డులో కొండలరాయుడు



పూలాంగ్ బ్రిడ్జి వద్ద ఐదు చేతుల పోచమ్మ ఆలయంలో విగ్రహాలు

కుల సంఘాల భాగస్వామ్యం



76 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ ఊర పండుగ ఉత్సవాల్లో ఎప్పటికప్పుడు మరిన్ని సంఘాలను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తూ ముందుకెళుతున్నాం. ప్రస్తుతం 60 సంఘాలు ఉన్నాయి. దీంతో పండుగకు, ఊరేగింపునకు మరింత శోభ పెరుగుతూ వస్తోంది. నగర ప్రజల్లో ఐకమత్యం పెరుగుతోంది. రాజకీయాలకతీతంగా ఈ క్రతువును ముందుకు తీసుకెళుతూ విజయవంతంగా నిర్వహిస్తున్నాం.
– యెండల లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు, సర్వసమాజ్ కమిటీ

కలిసికట్టుగా పాల్గొంటారు



నగరంలో ఎనిమిది దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఊర పండుగ ఉత్సవాల్లో ప్రతియేటా పాల్గొనే ప్రజల సంఖ్య బాగా పెరుగుతోంది. చిన్న ఊరుగా ఉన్న ఇందూరు నేడు పెద్ద నగరంగా అభివృద్ధి చెందింది. అయినప్పటికీ నగర ప్రజలు ఐకమత్యంతో పండుగ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.
– బంటు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి, సర్వసమాజ్ కమిటీ

27న బోనాలు తీస్తారు..



ఊర పండుగ నేపథ్యంలో ఈ నెల 27న నగరంలో బోనాలు తీయనున్నారు. తరాలు మారినప్పటికీ ఈ పండుగను నిర్వహించే విషయంలో ఆనవాయితీని క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరు పాటిస్తున్నారు. సరి (ప్రత్యేక పదార్థం)కి సంబంధించిన వస్తువులు సైతం ప్రతి ప్రాంతానికి సమానంగా పంపిణీ చేయడం జరుగుతోంది.
– ఆదె ప్రవీణ్‌కుమార్, కో–కన్వీనర్, సర్వసమాజ్ కమిటీ

ఎడతెరపి లేని వాన

- జిల్లాకు మరో రెండు రోజులు వర్షసూచన



సుభాష్‌నగర్: జిల్లావ్యాప్తంగా బుధవారం రోజంతా వర్షం కురిసింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమైంది. జిల్లాలో 13.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బాల్కొండలో 31.1, మోర్తాడ్‌లో 21.4, కమ్మర్‌పల్లిలో 21.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఐదారురోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, ప్రాజెక్టుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరితోపాటు ఆరుతడి పంటలకు తెగుళ్లు సోకే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్నారు. జిల్లాలో మరో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వర్షపాతం మిల్లీమీటర్లలో..

మండలం	వర్షపాతం		
బాల్కొండ	31.1	భీమ్‌గల్	16.2
మోర్తాడ్	21.4	ఏర్గట్ల	15.6
కమ్మర్‌పల్లి	21.1	నవీపేట్	15.3
ముప్కాల్	20.0	వేల్పూర్	15.3
నందిపేట్	18.9	రెంజల్	14.0
మెండోరా	17.7	డొంకేశ్వర్	13.8
ఆర్మూర్	17.4	నిజామాబాద్‌రూరల్	13.2
ఆలూరు	16.7	మాక్లూర్	11.9
సిరికొండ	16.6	నిజామాబాద్ సౌత్	11.5
		నిజామాబాద్‌నార్త్	11.0

కుండపోతకు ఏడాది

వేల్పూర్: వేల్పూర్ మండలంలో కుండపోత వర్షం కురిసి సరిగ్గా ఏడాది పూర్తవుతోంది. గతేడాది జూలై 24న రాత్రి మొదలైన అత్యంత భారీ వర్షం 25వ తేదీ తెల్లజాము వరకు ఆరు గుంటలకు పైగా కురిసింది. దీంతో 64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏడాది కాలంలో కురవాల్సిన వర్షం ఈ ఒక్కరోజు పడింది. ఆకాశానికి గండి పడిందా అన్న మాదిరిగా గంటల తరబడి కుండపోత వర్షం కురిసింది. దీంతో చెరువులు తెగిపోయాయి. ప్రధాన రహదారుల పూర్తిగా కోతకు గురయ్యాయి. వాగులు ఉప్పొంగి ప్రవహించాయి.



వేల్పూర్‌లో గతేడాది భారీ వర్షంతో డివైడర్‌పై నుంచి ప్రవహించిన వరదనీరు (ఫైల్)

బడ్జెట్‌పై గల్ఫ్ కార్మికుల ఆశలు

- వలస కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్లు కేటాయించాలని వినతి
- ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చిన గల్ఫ్ జేఏసీ నాయకులు



మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో గల్ఫ్ సంక్షేమం కోసం కేటాయింపులు చేస్తారా అనే అంశంపై చర్చ సాగుతోంది. వలస కార్మికుల సంక్షేమం తమ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులు అనేకమార్లు వెల్లడించారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు కార్యాచరణ ఆరంభించకపోవడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించేలా చూడాలని గల్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు వారం పది రోజుల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులను కలిసి విన్నవించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ఆర్ఐ సెల్‌కు రూ.100 కోట్లు కేటాయించినా మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. బీఆర్ఎస్ హయంలో గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు సంబంధించి అధ్యాయనం జరిపినా చర్యలు తీసుకోలేదు. కాంగ్రెస్ కూడా మేనిఫెస్టోలో గల్ఫ్ సంక్షేమం అంశం చేర్చింది. వలస కార్మికుల ఓట్లు రాబట్టుకోవడానికి కాంగ్రెస్ ముఖ్యనాయకులు ఎన్నికలకు ముందుగా గల్ఫ్ దేశాల్లో పర్యటించి వలస కార్మికుల మద్దతు కోరారు. ఈ నేపథ్యంలో తమ ఆశయాలను సాధించుకోవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి కేటాయింపులు జరపాలని కోరుతున్నారు.

కేటాయింపులు జరపాలి



బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్లు కేటాయించాలి. ఎన్నో ఏళ్లుగా వలస కార్మికులు నిరాదరణకు గురవుతున్నారు. ఏ ప్రభుత్వం కూడా వలస కార్మికుల గురించి ఆలోచన చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందనే ఆశతో ఉన్నారు.
– గుగ్గిల్ల రవిగౌడ్, గల్ఫ్ జేఏసీ చైర్మన్

ఆర్మూర్-ఆదిలాబాద్ లైన్‌కు మోక్షమెప్పుడో..!

- నిధుల కేటాయింపులో మొండిచేయి
- కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఊసేలేని వైనం



ఆర్మూర్: ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేకపోవడంతో నిర్మాణంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈ బడ్జెట్‌లోనైనా మోక్షం లభించేనా అని ఈ ప్రాంత ప్రజలు ఆసక్తిగా ఎదురు చూసినా వారికి నిరాశే ఎదురైంది. ఈ రైల్వే లైన్ పరిధిలోని నిజామాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ ఎంపీలుగా ధర్మపురి అర్వింద్, గోడం నగేశ్ ఉండడంతో నిధులు మంజూరవుతాయని ఆశించిన ప్రాంత ప్రజలకు భంగపాటే ఎదురైంది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ మూడు జిల్లాలను అనుసంధానం చేసే ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్ నిర్మాణం కోసం మూడు దశాబ్దాలుగా డిమాండ్ ఉంది. నిజామాబాద్ – ఆర్మూర్ – పెద్దపల్లి లైన్‌లో రైళ్ల నడుస్తుడడంతో ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్ ఏర్పాటుకు డిమాండ్ పెరిగింది. అయితే 136 కిలోమీటర్ల దూరం గల ఆర్మూర్ – ఆదిలాబాద్ మధ్య రైల్వేలైన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టాలని గతంలో నిర్ణయించారు. మొత్తం వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 51 శాతం, కేంద్ర ప్రభుత్వం 49 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. 2007–08 బడ్జెట్‌లో ఈ రైల్వేలైన్ సర్వే కోసం కేంద్రం నిధులు కేటాయించింది. ఈ మార్గం నిర్మాణానికి రూ. 699 కోట్లు అవసరం అవుతుందని సర్వేలో తేల్చారు. 2016–17 కేంద్ర బడ్జెట్‌లో ఆర్మూర్-నిర్మల్-ఆదిలాబాద్ రైల్వేలైన్‌ను మంజూరు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అయితే పదేళ్ల పాటు నిధుల కేటాయింపు జరగకపోవడంతో అంచనా వ్యయం రూ. 2,800 కోట్లకు పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 1,428 కోట్లు భరించాల్సి ఉంటుంది. రైల్వేలైన్ నిర్మాణానికి అవసరమైన భూమిని సమకూర్చడంతో పాటు ఇందుకు అయ్యే వ్యయంలో 51 శాతం భరించడంపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో అప్పటి నుంచి రైల్వే లైన్ నిర్మాణంపై కదలిక లేకుండా పోయింది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయిస్తుండడంతో భూమి సర్వేకు మాత్రమే ఈ నిధులను కేటాయించారు. భూసేకరణ అనంతరం రైతులకు నష్ట పరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తయితే గాని ఈ రైల్వేలైన్ ప్రాజెక్టు పనులు ముందుకు సాగేలా లేవు. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లికి లింక్ చేయాలని డిమాండ్

నిజామాబాద్ – పెద్దపల్లి రైల్వే నిర్మాణం పూర్తయినప్పటికీ రవాణా పరంగా ఆర్మూర్ ప్రాంత ప్రజలకు పెద్దగా ఉపయోగపడడం లేదు. ఆర్మూర్ ప్రాంత వాసులు హైదరాబాద్ వెళ్లాలంటే నిజామాబాద్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఆర్మూర్ – ఆదిలాబాద్ లైన్‌ను డిచ్‌పల్లి వరకు లింక్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. డిచ్‌పల్లికి లింక్ చేస్తే హైదరాబాద్‌కు వెళ్లేందుకు సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లికి లింక్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'ఇందూర్'కు మినీ స్టేడియం కేటాయించాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌తో పాటు మైదానం స్థలం 6 ఎకరాలకుపైనే ఉందని.. దీనిని మినీ స్టేడియం కోసం కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని శాసనసభ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఖేలో ఇండియా ద్వారా యువతను క్రీడారంగం వైపు ప్రోత్సహిస్తుంటే.. రాష్ట్రం పూర్తిగా వెనకబడిందని ఆరోపించారు. జిల్లా క్రీడాకారులు నిరాధారణకు గురవుతున్నారని, వారికి కనీసం మైదానం, సరైన క్రీడా పరికరాలు, కోచ్‌లు లేకుండా పోయారన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ స్థలాన్ని మినీ స్టేడియంగా, పాత ఇరిగేషన్ కార్యాలయంలోని 2 ఎకరాల స్థలంలో ఇండోర్ స్టేడియంను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. 15ఎకరాల్లో ఉన్న రాజారాం స్టేడియంలో ఎలాంటి సౌకర్యాలు లేవని, వెంటనే దాన్ని పూర్తిస్థాయి క్రికెట్ స్టేడియంగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

క్లుప్తంగా

గురుకుల కళాశాలల్లో స్పాట్‌ అడ్మిషన్స్‌

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్‌ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లలో ప్రవేశానికి స్పాట్‌ కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయాధికారులు ఎం.సత్యనారాయణ, నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2024లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినుల (బాలికల)కు ఈనెల 26న ఉదయం 10 గంటలకు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల (సీవోఈ)లో స్పాట్‌ కౌన్సెలింగ్‌ నిర్వహిస్తారని తెలిపారు. అలాగే విద్యార్థుల (బాలురు)కు 27న భిక్కనూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో స్పాట్‌ అడ్మిషన్స్‌ నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీజీ పరీక్షలకు 11 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్‌, పీజీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు బుధవారం 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌, న్యాయ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పీజీ ఇంటిగ్రేటెడ్‌ 6,7,8,9,10వ సెమిస్టర్‌, పీజీ 1,3వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 14 మందికి గాను 14 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 142 మందికి గాను 131 మంది హాజరైనట్లు వివరించారు.

బ్యాక్‌లాగ్‌ పరీక్షలు..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్‌ బ్యాక్‌లాగ్‌ 5, 6వ సెమిస్టర్‌ పరీక్షలకు బుధవారం ప్రశాంతంగా కొనసాగినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (నిజామాబాద్‌), ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ డిగ్రీ కాలేజ్‌ (కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (ఆర్మూర్‌) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 83 విద్యార్థులకుగాను 80 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు ముగ్గురు విద్యార్థులకు గాను ముగ్గురు హాజరయ్యారని తెలిపారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మే 21 నుంచి జూన్‌ 15వరకు నిర్వహించిన డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, 1, 3, 5వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షల రీవాల్యుయేషన్‌ కోసం దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్‌ ఎం అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో పేపర్‌కు రూ.500 ఫీజు చెల్లించి ఆగస్టు 3నుంచి 5వ తేదీ వరకు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాత ఏజెన్సీలకే కాంట్రాక్ట్‌ పొడిగింపు

- వైద్య విధాన పరిషత్‌ ఆస్పత్రుల్లో పాతవారే కొనసాగింపు
- మరో ఏడాది కాలానికి బాధ్యతల అప్పగింత



మోర్తాడ్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రి

మోర్తాడ్‌(బాల్కొండ): వైద్య విధాన పరిషత్‌ ఆస్పత్రుల్లో సెక్యూరిటీ, సానిటేషన్‌, పేషెంట్‌ కేర్‌ టేకర్‌ విభాగాల సిబ్బంది నియామకం, అజమాయిషీ కోసం ఏజెన్సీలకు కాంట్రాక్ట్‌ ఇచ్చిన ప్రభుత్వం పాత ఏజెన్సీలకే మరో ఏడాది కాంట్రాక్ట్‌ను రెన్యువల్‌ చేసింది. ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించకుండా ఏజెన్సీల ద్వారా మూడు రకాల సేవలను నిర్వహించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. 30 పడకల ఆస్పత్రుల్లో 13 మంది, జిల్లా జనరల్‌ ఆస్పత్రిలో 200 మంది, 100 పడకల ఆస్పత్రుల్లో 41 మంది చొప్పున సిబ్బందిని నియమించేందుకు ఏజెన్సీలకు అనుమతి ఇచ్చారు. మోర్తాడ్‌, బాల్కొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, కోటగిరి, వర్ని, నవీపేట్‌లో 30 పడకల, బోధన్‌, ఆర్మూర్‌లో 100 పడకల ఆస్పత్రులు ఉండగా, భీమ్‌గల్‌లో భవన నిర్మాణం పూర్తి కాలేదు. జిల్లా కేంద్రంలోని జనరల్‌ ఆస్పత్రిలో నిబంధనల ప్రకారం 200 మంది ఉద్యోగులను ఏజెన్సీ నిర్వాహకులు నియమించారు. వంద పడకల ఆస్పత్రుల్లో 41 మందికి బదులు 20 మందిని, 30 పడకల ఆస్పత్రుల్లో 13 మందికి బదులు 7 నుంచి 8 మందిని నియమించుకుని వారితోనే సేవలను వెళ్లదీశారు. ఏజెన్సీలు రాజకీయ పార్టీ నాయకుల గుప్పిట్లో ఉండటంతో బిల్లులు చేయడంలో అధికారులు ఒత్తిడికి తలొగ్గాల్సి వచ్చింది. వైద్య విధాన పరిషత్‌ అధికారులు మౌన పాత్రకు పరిమితమయ్యారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీలను మార్చాలని ఉన్నతాధికారులు నిర్ణయానికి వచ్చి జిల్లా కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు దృష్టికి తీసుకువెళ్లారు. అయితే, పార్లమెంట్‌ ఎన్నికల కోడ్‌ ఇతర కారణాలతో ఏజెన్సీల మార్పుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే ఏజెన్సీలు నడుపుతున్న నాయకులు సైతం పార్టీ మారారని, ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకువచ్చి పాత ఏజెన్సీలకే కాంట్రాక్ట్‌ పొడిగించేలా చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. రెండేళ్ల కాంట్రాక్ట్‌ ముగిసిపోవడంతో కొత్తగా టెండర్‌ నిర్వహించాల్సి ఉంది. మళ్లీ టెండర్లు నిర్వహిస్తే తమ ఏజెన్సీలకు కాంట్రాక్టు దక్కుతుందో లేదో అనే సందేహంతో నిర్వాహకులు పాత వాటికే కాంట్రాక్టు పొడిగించేలా ప్రభుత్వంతో ఆదేశాలు జారీ చేయించుకున్నారని పలువురు పేర్కొంటున్నారు.

నిబంధనల్లో మార్పులు

తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని కాంట్రాక్ట్‌ రెన్యువల్‌ చేసుకున్న ఏజెన్సీలకు అధికార యంత్రాంగం నిబంధనలను సవరించి చుక్కలు చూయిస్తుండటం విశేషం. సెక్యూరిటీ, సానిటేషన్‌, పేషెంట్‌ కేర్‌టేకరింగ్‌కు ఎంత మంది ఉద్యోగులు పని చేస్తే అంతే మందికి వేతనాలు చెల్లించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. గతంలో మాదిరిగా తక్కువ మంది పని చేసినా ఎక్కువ మందికి వేతనాల బిల్లు చెల్లించే విధానానికి స్వస్తి పలికారు. దీంతో ఏజెన్సీల ఆటకు అధికారులు అడ్డుకట్ట వేశారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీల ఆటకట్టించడంలో అధికారులు సఫలీకృతులయ్యారని అంటున్నారు.

కాంట్రాక్ట్‌ రెన్యూవల్‌ చేశాం

ఆస్పత్రుల్లోని మూడు విభాగాల్లో సేవలందించే ఉద్యోగులను నియమించుకున్న ఏజెన్సీలకు ఒక ఏడాది కాంట్రాక్ట్‌ రెన్యువల్‌ చేశాం. ఉద్యోగుల సంఖ్య, వారి హాజరు శాతం ఆధారంగానే బిల్లులు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. నిధులు పక్కదారి పట్టకుండా చూస్తున్నాం.

– డాక్టర్‌ శివశంకర్‌, డీసీహెచ్‌వో

ఐవీఎఫ్‌తో సంతానలేమికి చెక్‌

- అందుబాటులో నులువైన చికిత్స
- నేడు అంతర్జాతీయ ఐవీఎఫ్‌ దినోత్సవం





డాక్టర్‌ అర్చన, పినాకిల్‌ ఐవీఎఫ్‌ ఫెర్టిలిటీ సెంటర్‌

నిజామాబాద్‌నాగారం: సంతానలేమితో బాధపడుతున్న వారికి ఐవీఎఫ్‌ (ఇన్‌ విట్రో ఫెర్టిలైజేషన్‌) అనేది ఒక వరం లాంటిదని వైద్యురాలు అర్చన అన్నారు. జిల్లా కేంద్రంలో 'పినాకిల్‌ ఫెర్టిలిటీ' సెంటర్‌ ద్వారా సేవలందిస్తున్న వైద్యురాలు అర్చన.. అంతర్జాతీయ ఐవీఎఫ్‌ దినోత్సవం సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరు ఇన్‌ఫెర్టిలిటీ సమస్యతో సతమతమవుతున్నారని వరల్డ్‌ హెల్త్‌ ఆర్గనైజేషన్‌(డబ్ల్యూహెచ్‌వో) రిపోర్టులు వెల్లడించడం గమనార్హమని అన్నారు. అడ్వాన్స్‌డ్‌, ఎక్కువ సక్సెస్‌ రేట్‌ కలిగిన ఐవీఎఫ్‌ విధానం సంతానలేమితో బాధపడుతున్న వారికి మంచి అవకాశమని తెలిపారు. గ్రామీణప్రాంతాల వారికి సైతం తక్కువ ఖర్చుతో ఆధునిక సౌకర్యాల ద్వారా చికిత్స అందించడం పినాకిల్‌ ఫెర్టిలిటీ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఐవీఎఫ్‌కు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు సందేహాలను డాక్టర్‌ అర్చన నివృత్తి చేశారు.

ఐవీఎఫ్‌ ద్వారా పుట్టిన పిల్లల ఆరోగ్యంపై..

1978 జూలై 25న ఐవీఎఫ్‌ ద్వారా మొదటి బేబి లూయిస్‌ బ్రౌన్‌ జన్మించారు. నాలుగు దశాబ్దాలు నాటికి 8 మిలియన్ల పిల్లలు ఐవీఎఫ్‌ పద్ధతి ద్వారా జన్మించారు. ఇప్పటి వరకు చేసిన రిసెర్చ్‌, ఆర్టికల్స్‌ ఆధారంగా సహజంగా గర్భం ద్వారా పుట్టిన పిల్లలకి ఐవీఎఫ్‌ ద్వారా పుట్టిన పిల్లలకి ఎటువంటి తేడా లేదని తేలింది.

ఐవీఎఫ్‌ ద్వారా కవలలు పుట్టే అవకాశం..

ఐవీఎఫ్‌ పద్ధతిలో అంటే ఆడవారి అండాలను మగవారి వీర్యకణాలు కలిపితే వచ్చే పిండాలను గర్భసంచిలో ప్రవేశపెడతాం. ఈ పద్ధతిలో మునుపు రెండు లేక మూడు పిండాలను ప్రవేశపెట్టేవారు. అందువల్ల ఐవీఎఫ్‌లో కవలలు పుట్టే అవకాశం పెరుగుతుంది. కానీ ఇప్పుడు పెరుగుతున్న టెక్నాలజీతో గర్భం దాల్చే అవకాశాలు మెరుగయ్యాయి.

నొప్పి ఉంటుందంటారు..

ఆడవారు 10–12 రోజులపాటు ఐవీఎఫ్‌లో రోజూ కొన్ని ఇంజెక్షన్స్‌ తీసుకోవాల్సి ఉంటుంది. తరువాతే ఆడవారి శరీరంలో ఉండే అండాలను బయటకు తీసి మగవారి వీర్యకణాలతో కలపడం జరుగుతుంది. అలా పెరిగిన దాన్ని ఆడవారి గర్భసంచిలో ప్రవేశ పెడతాం. ఈ ప్రక్రియలు ఎగ్‌ పికప్‌ (ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్‌) అంటాం. ఇవన్నీ కూడా డే కేర్‌ ప్రొసీజర్స్‌ అంటే అదే రోజు ఇంటికి వెళ్లొచ్చు. ఐవీఎఫ్‌లో నొప్పి అనేది చాలా తక్కువ

తొమ్మిది నెలలు రెస్ట్‌ అవసరమా...

ఐవీఎఫ్‌ ద్వారా గర్భం దాల్చిన తర్వాత ఒక రెండు నెలలు జాగ్రత్త చెబుతాం. ఆ తరువాత సహజ ప్రెగ్నెన్సీ లాగే అన్ని పనులు చేసుకోవచ్చు. ఆఫీస్‌కి వెళ్ళేవాళ్లు, ఇంటి పనులు చేసుకునేవారు ఎప్పటిలాగే వారి పనులను చేసుకోవచ్చు.

సిజేరియన్‌ అవసరం లేదు..

ఐవీఎఫ్‌ ద్వారా గర్భం దాల్చిన వాళ్లు నార్మల్‌ డెలివరీ ఖచ్చితంగా చేయించుకోవచ్చు. ఐవీఎఫ్‌ ప్రెగ్నెన్సీ సహజ ప్రెగ్నెన్సీ లాగే ఉంటుంది. వేరే ఇతర కారణాల వల్ల సిజేరియన్‌ చేయించాల్సిన పరిస్థితి వస్తే తప్ప కేవలం ఐవీఎఫ్‌ వల్ల సిజేరియన్‌ చేయించాల్సిన అవసరం అసలు లేదు.

ఆర్మూర్‌ విద్యుత్‌ డివిజన్‌లో ఏం జరుగుతోంది?

- 'సాక్షి' కథనాలపై ఇంటెలిజెన్స్‌ ఆరా

సాక్షి ఎఫెక్ట్‌..

నిజామాబాద్‌నాగారం: జిల్లా విద్యుత్‌శాఖ పరిధిలోని ఆర్మూర్‌ డివిజన్‌లో అసలేం జరుగుతోందని ఇంటెలిజెన్స్‌ ఆరా తీస్తోంది. డివిజన్‌ పరిధిలో అవినీతి అక్రమాలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నెల 8న ఆర్మూర్‌ డీఈపై ఏపీటీఎస్‌ విచారణ, 12వ తేదీన 'ఆర్మూర్‌ డివిజన్‌లో ఇదేమి లెక్క', 18వ తేదీన మరుగుదొడ్లు కట్టకున్నా బిల్లులు, 22వ తేదీన విద్యుత్‌ అధికారుల విచిత్ర ధోరణి, 23వ తేదీన 'త్వరలో విచారణకు ఆదేశాలు' శీర్షికన కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్మూర్‌ విద్యుత్‌ డివిజన్‌లో అసలు ఏం జరుగుతోంది? ఎవరెవరు ఏం చేస్తున్నారు? అనే దానిపై ఇంటెలిజెన్స్‌ వర్గాలు ఆరా తీస్తున్నాయి. పూర్తి నివేదికను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు సమాచారం.

భవానీపేట్‌లో సినిమా షూటింగ్‌



బోధన్‌రూరల్‌: మండలంలోని భవానీపేట్‌లో బుధవారం సినిమా షూటింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా నిర్మాత ఆదినారాయణ మాట్లాడుతూ.. తాము నిర్మిస్తున్న సినిమాకు ఇంకా టైటిల్‌ ఖరారు చేయలేదన్నారు. ఈ సినిమాకు డైరెక్టర్‌గా శంకర్‌ పని చేస్తుండగా.. హీరోగా ఆది, హీరోయిన్‌గా హనిక, ప్రధాన పాత్రలో నానిబాబు నటిస్తున్నారని తెలిపారు. షూటింగ్‌కు పోలీసులు, స్థానికుల నుంచి పూర్తి మద్దతు లభిస్తోందన్నారు.

నిఖత్‌కు అభినందనలు



విలేకరులతో మాట్లాడుతున్న బొబ్బిలి నర్సయ్య

నిజామాబాద్‌నాగారం: ఒలింపిక్స్‌కు వెళ్తున్న జిల్లాకు చెందిన బాక్సింగ్‌ క్రీడాకారిణి నిఖత్‌ జరీన్‌కు జిల్లా ఒలింపిక్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆడ పిల్లలపై వివక్ష చూపుతున్న ప్రస్తుత కాలంలో జిల్లాకు చెందిన నిఖత్‌ జరీన్‌ ఒలింపిక్స్‌లో పాల్గొనుండడం గర్వకారణమన్నారు. పారిస్‌ జరిగే ఒలింపిక్స్‌లో నిఖత్‌ బంగారు పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో నిఖత్‌ తండ్రి జమీల్‌, అసోసియేషన్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీ పోస్టుల భర్తీ

నిజామాబాద్‌అర్బన్‌: కేజీబీవీలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది కేజీబీవీలో వివిధ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి కొన్ని పోస్టులను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. మిగతా పోస్టులను భర్తీ చేసేందుకు మళ్లీ సబ్జెక్టుల వారీగా మెరిట్‌ లిస్టును జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. మెరిట్‌ లిస్ట్‌ ఆధారంగా అభ్యర్థులు ఈనెల 25, 26 తేదీల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్‌: నిజాంసాగర్‌లోని జవహర్‌ నవోదయ విద్యాలయంలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రాజు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆసక్తిగలవారు సెప్టెంబర్‌ 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో



ఐఎస్‌వో సర్టిఫికెట్‌ అందుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్‌ వేణుగోపాల్‌

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతులు, విద్యార్థులకు అభ్యాసన వాతావరణాన్ని గుర్తించిన హెచ్‌వైఎం ఇంటర్నేషనల్‌ సర్టిఫికేషన్‌ సంస్థ ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేసింది. సంస్థ ప్రతినిధులు కళాశాలను సందర్శించారు. సంస్థ బాధ్యుడు శివ ఆలపాటి ప్రిన్సిపాల్‌ వేణుగోపాల్‌కు సోమవారం ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. కళాశాలలో విద్య, నాణ్యతను ఐఎస్‌వో సంస్థ గుర్తించి ధ్రువీకరించడం సంతోషంగా ఉందన్నారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్‌ ఉంటుందన్నారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్‌ రాజేశ్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మికాలువ ఆనకట్టకు కోతలు

- వర్షం నీటితో కోతకు గురైన ఆనకట్ట
- చెట్లను యంత్రంతో తీయడం కారణంగానే ఈ పరిస్థితి..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు



కోతకు గురైన లక్ష్మి కాలువ ఆనకట్ట

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మికాలువ ఆనకట్ట కోతలకు గురవుతోంది. దీంతో ఆయకట్టుకునీటి సరఫరా సమయంలో కాలువ ఆనకట్టకు గండి పడే ప్రమాదం ఏర్పడింది. కాలువ లైనింగ్‌ పూర్తిగా ధ్వంసమైంది. ఎగువ ప్రాంతలం నుంచి వర్షపు నీరు రావడంతో ఆనకట్ట మొత్తం కోతకు గురైంది. దీంతో ఆయకటుట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మికాలువ ఆనకట్టకు ఇరు వైపులా ఏపుగా చెట్లు పెరిగాయి. చెట్లను తొలిగించడంలో అధికారులు యంత్రాన్ని వినియోగించారు. యంత్రం సహాయంతో వేర్ల నుంచి చెట్లనుతొలిగించారు. దీంతో వేర్ల ద్వారా సిమెంట్‌ లైనింగ్‌ పూర్తిగా ధ్వంసమైంది. అంతే కాకుండా కాలువ ఆనకట్ట వదులు కావడం, వర్షం కురువడంతో ఆనకట్ట పూర్తిగా కోతకు గురైంది. అసలు ఇది.. కాలువ ఆనకట్టేనా అనే పరిస్థితి ఏర్పడింది. అధికారులు చెట్లను వేర్ల నుంచి తొలిగించకుండ వాటిని కోసి ఉంటే పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదని రైతులు అంటున్నారు. ముప్కాల్‌ మండలం నల్లూర్‌ శివారులో నిర్మిస్తున్న సైఫన్‌ కోసం నీటిని వేరే చోటు నుంచి మళ్లించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో ఎగువ నుంచి భారీ వర్షపు నీరు వచ్చి సైఫన్‌ నిర్మాణం వద్ద గండి ఏర్పడింది. కాలువ పరిస్థితి ఇలానే ఉంటే ఖరీఫ్‌ సీజన్‌లో ఆయకట్టుకు నీటి విడుదల సందర్భంగా కాలువ కట్టకు గండిపడే ప్రమాదం ఉంది. మళ్లీ వర్షాలు కురిస్తే మరింత కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. ఆనకట్ట ను బలోపేతం చేసేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో నీటి విడుదలకు తీవ్ర అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది. కాలువ కోతకు గురి కావడంతో ఆనకట్ట మట్టి, మొరం అంతా కాలువలో కుప్పలు కుప్పలుగా పేరుకు పోయి నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి కాలువ కట్ట పూర్తిగా ధ్వంసం కాకముందే చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ గిఫ్ట్‌ స్కీం లక్కీ డ్రా



లక్కీ డ్రా తీస్తున్న దృశ్యం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ నుంచి వరంగల్‌కు డీలక్స్‌ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు గిఫ్ట్‌ స్కీం ప్రవేశ పెట్టినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో లక్కీ డ్రాలో విజేతలను ఎంపిక చేశారు. ఆర్‌ఎం మాట్లాడుతూ 15 రోజులకు ఒకసారి గిఫ్ట్‌ బాక్స్‌ నుంచి డ్రా తీసి ముగ్గురిని ఎంపిక చేస్తామన్నారు. డ్రాలో పి శ్రుతి, బి రోహిణి, జె సింధురా ఎంపికయ్యారని పేర్కొన్నారు. విజేతలకు సౌత్‌ ఇండియా షాపింగ్‌ మాల్‌ సౌజన్యంతో బహుమతులు అందజేస్తామని తెలిపారు. సౌత్‌ ఇండియా షాపింగ్‌మాల్‌ సిబ్బంది అశోక్‌కుమార్‌, లక్ష్మణ్‌రావు, సత్యనారాయణ ఉన్నారు.



క్రైం కార్నర్‌

తండ్రి హత్య కేసులో జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: తండ్రిని హత్య చేసిన కేసులో కొడుకుకి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా జడ్జి డాక్టర్‌ సీహెచ్‌ వీఆర్‌ఆర్‌ వరప్రసాద్‌ తీర్పు వెలువరించారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. 2021 మార్చి 9వ తేదీన క్యాసంపల్లి తండాకు చెందిన భూక్యా ఫకీరా(65) ఉగ్రవాయి శివారులో హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఫకీరాను హత్య చేసి చెట్టుకు ఉరివేసుకున్నట్లు నమ్మించే ప్రయత్నం చేయడంతో మృతుడి తమ్ముడి కొడుకు భూక్యా హుస్సేన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న దేవునిపల్లి పోలీసులు మృతుని కుమారుడు భూక్యా భాషాను అదుపులోకి తీసుకుని విచారించగా.. డబ్బుల విషయంలో గొడవల కారణంగా తండ్రిని తానే హత్య చేసినట్లు నేరం అంగీకరించాడు. కేసు కోర్టులో ఉండగా, బుధవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితుడికి జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్‌, సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత రూరల్‌ సీఐ రామన్‌, ఎస్సై రాజు, కోర్టు కానిస్టేబుళ్లు బాలకృష్ణ, దేవిచంద్‌ను ఎస్పీ సింధుశర్మ అభినందించారు.

భార్యపై హత్యాయత్నం కేసులో ఐదేళ్లు..

భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు కామారెడ్డి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపేట మండలం పోతాయిపల్లికి చెందిన గారబోయిన చిన్న సంగయ్య ఏడాది క్రితం అతని భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడంతోపాటు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన కామారెడ్డి కోర్టు అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి టి నాగరాణి.. నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. కేసును విచారించిన సీఐ శ్రీనివాస్‌, ఎస్సై చైతన్యకుమార్‌, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ దామోదర్‌రెడ్డి, పోలీసు సిబ్బందిని ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

భూ ఆక్రమణపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నిమ్మచెట్లను ధ్వంసం చేయడంతోపాటు తన వ్యవసాయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి మండలంలోని కోనసముందర్‌ గ్రామానికి చెందిన కండే క్రాంతిబాలరాజ్‌ సీపీ కల్మేశ్వర్‌కు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని సర్వే నంబర్‌ 404/21లో ఉన్న తన భూమిలోని నిమ్మచెట్లను ఈనెల 7వ తేదీన ఉదయం గ్రామానికి చెందిన నల్ల గంగాధర్‌తోపాటు అతడి కుమారుడు నల్ల సోమేలు దున్నేశారని, అడ్డు వెళ్లిన తనను ట్రాక్టర్‌తో గుద్ది చంపుతామని బెదిరించారని, కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన జరిగిన రోజునే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదని తెలిపాడు.

పేకాటస్థావరాలపై దాడులు

కామారెడ్డి క్రైం: పట్టణ పరిధిలోని లింగాపూర్‌ గ్రామ శివారులో కొనసాగుతున్న పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,12,800 నగదు, 2 కార్లు, 4 బైకులు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్‌ సీఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రామడుగులో..

ధర్పల్లి: మండలంలోని రామడుగు శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.2180 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బోధన్‌రూరల్‌: మండలంలోని ఊట్‌పల్లికి చెందిన బి సావిత్రి అనే మహిళ ఇంటి తాళాలను దుండగులు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. మంగళవారం సాయంత్రం గ్రామంలో ఉంటున్న బంధువు మరణించగా, సావిత్రి తన ఇంటికి తాళం వేసి అంత్యక్రియలకు వెళ్లింది. బుధవారం ఉదయం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో దాచిన రూ.30వేల నగదు, 3 గ్రాముల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి రిమాండ్‌

బోధన్‌రూరల్‌: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తిని పోక్సో కేసులో రిమాండ్‌కు తరలించినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను నిందితుడు బలవంతం చేశాడని, బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ నెల 22న పోక్సో కేసు నమోదు చేశామన్నారు. బుధవారం నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌ తరలించామన్నారు.

అటవీ బేస్‌ క్యాంప్‌ సిబ్బందిపై దాడి

నిందితులపై కేసు నమోదు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి అటవీ క్షేత్రం పరిధిలోని బేస్‌ క్యాంప్‌ సిబ్బందిపై దాడి చేసిన నర్సాపూర్‌కు చెందిన ముగ్గురిపై కేసు నమోదైంది. ఎఫ్‌ఆర్‌వో రవీందర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బషీరాబాద్‌ బీట్‌ పరిధిలోని కోనసముందర్‌ అటవీ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి నర్సాపూర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు జేసీబీతో అటవీభూమిని చదును చేస్తున్నారని సమాచారం అందడంతో సెక్షన్‌ ఆఫీసర్‌ రాజు, బీట్‌ ఆఫీసర్‌ సునీత, తిరుపతి వెళ్లారు. రిజర్వ్‌ ఫారెస్ట్‌లో నుంచి బయటకు వస్తున్న జేసీబీని విచారణ కోసం అటవీ అధికారులు ఆపేందుకు ప్రయత్నించగా, ఆపకుండా సదరు వ్యక్తులు నర్సాపూర్‌వైపు వెళ్లారు.

బేస్‌ క్యాంపు సిబ్బందికి సమాచారం అందించగా, వారు చేరుకొని జేసీబీని నిలిపివేశారు. వాహనంలో నుంచి కిందికి దిగిన ముగ్గురు వ్యక్తులు బేస్‌ క్యాంపు సిబ్బందిపై దాడి చేయగా, వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అబ్దుల్‌ ముజాహిద్‌, గఫార్‌ అబ్దుల్‌, జావిద్‌ అబ్దుల్‌ జుబేదార్‌ జేసీబీలో ఉన్నట్లు గుర్తించారు. ఎఫ్‌ఆర్‌వో ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. నిందితులపై గతేడాది అటవీ భూమి ఆక్రమణ కేసు నమోదై ఉందని తెలిపారు.

గుట్కా పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని టాస్క్‌ ఫోర్స్‌, పోలీసులు బుధవారం సాయంత్రం సంయుక్తంగా దాడి చేసి రూ.లక్ష విలువైన గుట్కాను పట్టుకున్నారు. వాహనంలో గుట్కా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేశారు.

తల్లిపై దాడి.. కేసు నమోదు

ఎల్లారెడ్డి: మండలంలోని లక్ష్మాపూర్‌ గ్రామానికి చెందిన భాగీర్థపై ఆమె కుమారుడు జైపాల్‌ దాడి చేసి గాయపరిచినట్లు ఎస్సై మహేశ్‌ బుధవారం తెలిపారు. జైపాల్‌ తరుచు మద్యం సేవించి వస్తుండడంతో తల్లి మందలించిందని, దీంతో ఆమెపై దాడి చేశాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆమె కొడుకుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.